క్లుప్తంగా

చోళసముద్రంలో ఉద్రిక్తతకు తెర



ఆందోళనకారులకు సర్ది చెప్తున్న పోలీసులు

కూడేరు: చోళసముద్రంలో చిట్రా శివ మృతదేహాన్ని సోమవారం మధ్యాహ్నం వరకు రైతు నాగరాజు ఇంటి ముందు ఉంచి కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు సర్ది చెప్పారు. నెల రోజులు పాటు వైద్యానికి సుమారు రూ.12 లక్షలు ఖర్చు పెట్టామని, ఆ మొత్తాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు నాగరాజు రూ.3.5 లక్షలు ఇస్తానని, అంతకంటే ఎక్కువ ఇవ్వలేనని తెగేసి చెప్పాడు. బాధితులు కోపంతో ఆ డబ్బు తీసుకోకుండా చిట్ర శివ మృతదేహాన్ని అక్కడి నుంచి తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు. దీంతో ఉద్రిక్తతకు తెరపడింది. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

సినిమా థియేటర్లలో దోపిడీని అరికట్టండి



ఆర్డీఓ వసంతబాబుకు సమస్యలను విన్నవిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: నియోజకవర్గ కేంద్రంలోని సినిమా థియేటర్లలో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని పట్టణ వాసులు ఆర్డీఓ వసంతబాబుకు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పట్టణ వాసులు టీపీ సురేష్, తిరుమలేష్, రాజ్‌కుమార్, టీపీ కిరణ్ ఆర్డీఓకు వినతిపత్రం అందించారు. నిబంధనలకు విరుద్ధంగా సినిమా టికెట్ల ధరలను పెంచుతూ సినీ అభిమానుల నడ్డి విరుస్తున్నారన్నారు. థియేటర్లలో సౌకర్యాలు లేకపోయినా నడుపుతున్నట్లు తెలిపారు. మరుగుదొడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నా రు. కొత్త సినిమాలు ప్రారంభం కాగానే యజమానులు అధిక ధరలకు టికెట్లను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు.

అవగాహనతో ఎయిడ్స్ నిర్మూలన



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : అవగాహనతోనే ఎయిడ్స్ నిర్మూలన సాధ్యమవుతుందని, ప్రజల్లో అవగాహన కల్పించడం అవసరం అని వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో రిడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బస్టాండ్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. తహసీల్దార్ సుమతి, ఎంపీడీఓ నందకిశోర్ పాల్గొని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ అబ్బాస్, ఎంఈఓ -2 కృష్ణానాయక్, రిడ్స్ ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్, సూపర్‌వైజర్ రామలక్ష్మమ్మ, ఫార్మసిస్టు మహేష్, ల్యాబ్ టెక్నీసియన్ పవన్, ఏఎన్ఎం నాగమణి, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజం అందరి బాధ్యత

బొమ్మనహాళ్: ఎయిడ్స్ రహిత సమాజం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఇందు కోసం యువత నడుం బిగించాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి మల్లేశ్వరి అన్నారు. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో రీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ యుగేంధర్, రీడ్స్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతు శిక్షణ కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తాం

కళ్యాణదుర్గం: స్థానిక కేవీకే సమీపంలో నిరుపయోగంగా ఉన్న పశు సంవర్ధక శాఖ రైతుల శిక్షణ కేంద్ర భవనాన్ని అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చెప్పారు. సోమవారం స్థానిక పశు సంవర్ధక శాఖ అధికారులతో కలిసి భవనాన్ని పరిశీలించారు. అనంతరం మౌలిక సదుపాయాలు కల్పించి రైతులకు శిక్షణ ఇచ్చేలా భవనాన్ని వినియోగించేలా అందుబాటులోకి తెస్తామన్నారు.

పిల్లలు ఉన్నతంగా చదవాలి



ఆర్డీటీ అందించిన సైకిళ్లతో విద్యార్థినులు

కళ్యాణదుర్గం: గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా చదవాలని ఆర్డీటీ కళ్యాణదుర్గం ఏటీఎల్ రామాంజనేయులు అన్నారు.సోమవారం మండల పరిధిలోని స్థాపంపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆర్డీటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ చేశారు. స్పెయిన్‌కు చెందిన సుమారు 42 మంది విదేశీయులు హాజరై సైకిళ్లను అందించారు. ఈ సందర్భంగా ఏటీఎల్ మాటాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేయాలన్నారు. చదువుకున్న పాఠశాలతో పాటు తల్లిదండ్రులకు మంచి పేరును తీసుకురావాలన్నారు. పేద పిల్లల చదువులకు ఆర్డీటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్టీఎల్ నారాయణస్వామి, టీటీఎం నాగభూషణ, సీసీ సలీం బాషాలతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొలం పిలుస్తున్నా...

- రైతులకు అందని సలహాలు, సూచనలు
- కార్యక్రమంలో పాల్గొనని అన్ని శాఖల అధికారులు
- ఫొటోలతో సరిపెట్టుకుంటున్న వైనం

పలకని అధికారులు



ఈ చిత్రంలో మామిడితోట చూపుతున్న రైతు పేరు తిమ్మారెడ్డి. ఈయన ఏడెకరాల్లో బేనిస, బెంగళూరు రకం మామిడి మొక్కలు పెంచుతున్నాడు. పంట సాగుకు రైతుకు సలహాలు ఇచ్చే అధికారులు లేరు. ఏ సమయంలో తోటను కాతకు వదులుకోవాలి..కత్తిరింపు ఏనెలలో చేసుకోవాలి.. నీటి మోతాదు.. ఇలా యాజమాన్య పద్ధతులపై అవగాహన లేదు.చీడపీడలు, తెగుళ్లను నివారించుకోవడానికి ఫెర్టిలైజర్ దుకాణానికి వెళ్లి మందులు తెచ్చుకుంటున్నాడు. ఉద్యాన అధికారి పంటను పరిశీలించి, రైతుకు అవగాహన కల్పించి ఉంటే అధిక దిగుబడి వచ్చేదంటున్నాడు.



తిప్పనపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం కోసం ఫొటో తీయించుకుంటున్న వ్యవసాయాధికారులు (ఫైల్)

శెట్టూరు: రైతు శ్రేయస్సే లక్ష్యంగా.. నూతన సాగు పద్ధతులు, నూతన వంగడాల పరిచయం వ్యవసాయంలో నూతన శాస్త్ర సాంకేతిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, పండిన పంట మార్కెటింగ్, గిట్టుబాటు ధర, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పొందాలనే ఉద్దేశంతో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ప్రవేశపెట్టింది. అయితే వ్యవసాయం, దాని అనుబంధ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలోనే పంట పొలాలను పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించాల్సి ఉన్నా .. మొక్కుబడిగా చేస్తున్నారు.

నియోజకవర్గంలోని శెట్టూరు, కంబదూరు, కుందుర్పి, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం మండలాల్లో వ్యవసాయ అధికారులు మాత్రమే పొలం పిలుస్తోంది కార్యక్రమన్ని నిర్వహిస్తున్నారు. ఐదు మండలాల్లో 74 గ్రామ పంచాయతీల్లో సెప్టెంబర్ నెల 24న ప్రారంభమైన కార్యక్రమం 2025 జనవరి నెల 2 వరకు నిర్వహించాల్సి ఉంది. వారంలో రెండు రోజులపాటు మంగళ, బుధవారాల్లో కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించారు. రోజుకు రెండు గ్రామాల చొప్పున ప్రతివారం నాలుగు గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించాల్సి ఉంది. వ్యవసాయశాఖతో పాటు ఆత్మ, సెరికల్చర్, ఉద్యాన శాఖ, పశుసంవర్ధకశాఖ, ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్, కోపరేటివ్ పెడరేషన్, మత్స్య, మార్కెటింగ్ శాఖ, ఇరిగేషన్, విద్యుత్, ప్రకృతి వ్యవసాయ, తదితర ఇలా సుమారు 10 శాఖల అధికారులు విధిగా హాజరుకాల్సి ఉండగా ఒకటి రెండు శాఖల అధికారులు మాత్రమే హాజరవుతున్నారు.

పంట పొలాల్లో ఫొటోలు దిగి..

ఖరీఫ్‌లో రెగ్యులర్ పంటలతోపాటు మిరప, టమాట, బొప్పాయి, ఉల్లి, మామిడి, జామ, నిమ్మ, వంటి పంటలు సాగుల్లో ఉన్నాయి. రబీ సీజన్‌కూడా మొదలైంది. వ్యవసాయ అధికారులు ఎంపిక చేసిన రైతుల పంట పొలాల్లోకి వెళ్లి ఫొటోలు దిగి కార్యక్రమం పూర్తయినట్లు వెళ్లిపోతున్నారు. రైతులకు సాగు వ్యయం తగ్గింపు, చర్యలపై అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంది. నూత సాగుపద్ధతులు, మేలు రకాల వంగడాలు, ఉత్తమ సాగు ఫలితాలపై అధికారులు క్షేత్ర స్థాయిలో రైతులను చైతన్య పరచాలి. వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి కార్యక్రమాలు ఏర్పాటు చేసి, రైతుల అనుమానాలు నివృత్తి చేయాలి. అయితే అన్నిశాఖల అధికారులు హాజరుకావడంలేదు.

చీడపీడలపై సూచనలు లేవు



ఒక ఎరం టమాట, రెండు ఎకరాల్లో వేరుశనగ బోరు బావికింద సాగు చేశాం. టమాటాలో వాతా వరణ పరిస్థితుల వల్ల మొక్కలు ఎదుగుదల తక్కువగా ఉంది. వేరుశనగలో పచ్చపురుగు, ఇతర చీడపీడలు ఉన్నాయి. మేమే మందులు, ఎరువులు తెచ్చుకుంటున్నాం. సమస్య చెప్తే పెస్టిసైడ్ షాపులోనే మందులు ఇస్తున్నారు. వ్యవసాయ అధికారులు పొలాన్ని పరిశీలించి, మందులు రాసిస్తే బాగుంటుంది.

– రైతు కిష్టప్ప, కుందుర్పి

అన్నిశాఖలకు తెలియజేశాం



పొలం పిలుస్తోంది కార్యక్రమంపై వ్యవసాయ అనుబంధశాఖల అధికారులకు తెలియజేశాం. నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై చర్యలు తీసుకుంటాం. షెడ్యూల్ అందజేశాం. ప్రతి వారం నాలుగు గ్రామాల్లో కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ప్రతి మండల వ్యవసాయ అధికారికి కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలని ఆదేశించాం. క్షేత్ర స్థాయిలో అధికారులు పంట పొలాలను పరిశీలించాలి, కార్యక్రమాలు పొలంలోనే నిర్వహించాలని తెలియజేశాం.

– యల్లప్ప, ఏడీఏ, కళ్యాణదుర్గం

మున్సిపల్ పాలకవర్గం పటిష్టంగా ఉండాలి

- కౌన్సిలర్లతో మాజీ ఎంపీ తలారి రంగయ్య



కౌన్సిలర్లతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: మున్సిపల్ పాలకవర్గం పటిష్టంగా ఉండాలని, నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడాలని మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య స్పష్టంచేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, వైస్ చైర్మన్ జయం ఫణితో కలిసి కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తలారి రంగయ్య మాట్లాడుతూ అధికారం లేదని ఎవరూ నిరుత్సాహ పడకూడదన్నారు. మున్సిపల్ పాలక వర్గంగా మనకే అధికారం ఉంటుందన్నారు. వార్డులలో ఏ చిన్న సమస్య వచ్చినా మనల్ని నమ్ముకున్న వారికి అండగా ఉండాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మున్సిపాలిటీలో చేపట్టే కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు కమిషనర్, అధికారులను ప్రశ్నించి, ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. రాజకీయాలకు తావు లేకుండా చేపట్టిన పనులకు వెంటనే బిల్లులు చెల్లించేలా మున్సిపల్ అధికారులు చొరవ చూపాలన్నారు. రాజకీయాలు కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే చేయాలని అధికారంలోకి ఏ పార్టీ వచ్చినా ప్రజలకు మంచి చేయడానికి కృషి చేసేలా ఉండాలని చెప్పారు. అనంతరం మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి పార్టీ నేతలు, కౌన్సిలర్లు సమష్టిగా పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలోనే మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 24 వార్డులలో సమస్యలపై ప్రజల వద్దకు వెళ్లేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు సుధీర్, గోపారం శ్రీనివాసులు, తిరుమల వెంకటేశులు, లక్ష్మన్న, అర్చన, కుర్రా రాము, శ్రీకాంత్‌రెడ్డి, పరమేశ్వరప్ప, కోఆప్షన్ సభ్యులు అప్జల్, సల్లా మారుతి పాల్గొన్నారు.

కొనసాగుతున్న అధికారుల వేధింపులు



కోతిగుట్టలోని 17వ చౌకధాన్యపు డిపోలో తనిఖీలు చేస్తున్న అధికారులు

రాయదుర్గంటౌన్: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అధికారిక పార్టీ రాజకీయ నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన రెవెన్యూ అధికారులు..డీలర్లను వేధింపులకు గురి చేస్తున్నారు. సోమవారం పట్టణంలోని కోతిగుట్టలోని 17వ ఎఫ్‌పీ షాపుపై సీఎస్‌డీటీ సుదర్శనాచారి, సర్వేటీడీ, వీర్వోలు దాడి చేసి, తనిఖీ చేశారు. దుకాణంలో బియ్యం, చక్కెర స్టాకు సక్రమంగా ఉన్నా.. అధికారులు అవకతవకలున్నట్లు కేసు నమోదు చేసేందుకు యత్నించగా, డీలర్ రామకృష్ణ అధికారులను నిలదీశాడు. దీంతో చేసేదిలేక అధికారులు వెనుదిరిగారు. పట్టణంలోని స్టోరు డీలర్లు బహిరంగంగా డబ్బా తుకాలతో కార్డుదారులను మోసం చేస్తున్నా పట్టించుకోలేదని, టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకునేందుకు పాతడీలర్లను వేధిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

స్టోర్లు సీజ్ చేయడంతో హైకోర్టుకు వెళ్లిన డీర్లు..

పట్టణంలోని మొత్తం 23 చౌక ధాన్యపు డీపోలు ఉన్నాయి. రాజకీయ ఒత్తిళ్లతో తనిఖీలు చేసి, ఇప్పటికే 13 స్టోర్లను టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కట్టబెట్టారు. మరికొందరిని రాజీనామాలు చేయించేందుకు తనిఖీల పేరుతో ఒత్తిడి పెంచారు. ఇటీవల 18వ నంబర్ చౌక ధాన్యపు డిపో డీలర్ దస్తగిరి, 9వ నంబర్ స్టోరు డీలర్ ఉమాపతి స్టోర్లను అధికారులు తనిఖీలు చేసి స్టాక్ సక్రమంగా ఉన్నా వ్యాత్యాసం ఉన్నట్లు కేసు నమోదు చేసి, స్టోర్లను సీజ్ చేశారు. దీంతో ఇద్దరు డీలర్లు న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు 43 మంది ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం రాజశేఖర్‌రెడ్డి తదితరులు

కంబదూరు: మండలంలోని నూతిమడుగు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో భాగంగా అండర్ 14,17,19 విభాగాల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఖోఖో, వాలీబాల్, సాఫ్ట్ బాల్, బేస్ బాల్, బాల్ బాడ్మింటన్, ఆర్చరీ, హ్యాండ్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్ తదితర పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. 43 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రాజశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. పీడీలు ఓబుళేసు, సంజీవరాయుడు, విద్యార్థులను హెచ్‌ఎం,పాఠశాల సిబ్బంది, స్కూల్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

వరికి గిట్టుబాటు ధర కల్పించండి



కణేకల్లులో వరి రాసులను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

కణేకల్లు: రైతులు కష్టపడి పండించిన వరిధాన్యానికి రూ.3 వేలు గిట్టుబాటు ధర కల్పించి రైతుసేవా కేంద్రాల ద్వారా నేరుగా కొనుగోలు చేయాలని రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) జిల్లా అధ్యక్షుడు పి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. కణేకల్లు శివారులో రోడ్లపై పోసిన వరి రాసులను జిల్లా ఉపాధ్యక్షులు ఓబులేసు, హనుమంతులతో కలిసి జిల్లా అధ్యక్షులు సందర్శించారు. రైతుల కష్టాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ గతేడాది క్వింటా వరి ధాన్యం రూ.3,100 ఉండగా, ఈసారి రూ.2 వేలు మాత్రమే ఉందన్నారు. వరిధాన్యానికి గిట్టుబాటు ధర లేక కొనేవారులేరన్నారు. అనంతరం తహసీల్దార్ ఫణికుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కణేకల్లు మండల రైతు సంఘం అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, నాయకులు ఆంజనేయులు, లక్ష్మన్న, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సభ్యసమాజం తలదించుకునేలా వ్యాఖ్యలు తగవు

వజ్రకరూరు: తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సభ్యసమాజం తలదించుకునేలా మాట్లాడటం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కమలపాడు వెంకటరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కమలపాడు వెంకటరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డిపై జేసీ ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. జిల్లాలో జరుగుతున్న పరిణామాలు, రైతుల ఇబ్బందులు, ఎన్నికల హామీలు తదితర వాటిపై జిల్లా అధ్యక్షుడు అనంత మాట్లాడటం జరిగిందని, ఏ ఒక్కరినీ ఉద్దేశించి మాట్లాడలేదన్నారు. అనంత కుటుంబానికి జిల్లాలో ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. అలాంటి వ్యక్తిపై ప్రభాకర్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. ఇకనైనా జేసీ ప్రభాకర్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. రాజకీయాల్లో అధికార మనేది శాశ్వతంకాదని, ఇదే విషయాన్ని ప్రభాకర్‌రెడ్డి గుర్తుపెట్టుకోవాలన్నారు. ఇందులో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జోడు లింగాలకు పూజలు

కూడేరు: మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శంభో శంకర హర హర మహదేవ అంటూ శివనామస్మరణ మార్మోగింది. ఆలయ అర్చకులు జోడు లింగాలకు రుద్ర, క్షీరాభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

15లోపు పంటల బీమా చేయించుకోవాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఆర్‌డీఓ వసంత్‌బాబు

కళ్యాణదుర్గం రూరల్: రబీలో పంటలను సాగు చేసిన రైతులు తప్పకుండా వాతావరణ బీమాను సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డీఓ వంసత్‌బాబు తెలిపారు. సోమవారం పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయంలో వాతావరణ పంట బీమలకు చెందిన పోస్టర్లను ఏడీఏ ఎల్లప్ప,తహసీల్దార్ భాస్కర్, ఉద్యాన శాఖ అధికారి కృష్ణతేజ విడుదల చేశారు. ఆర్‌డీఓ మాట్లాడుతూ ఈనెల 15 లోపు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ జిల్లా మేనేజర్ మూర్తి సెల్: 9666838052 సంప్రదించాలన్నారు.

కూడేరు: 2024–25 రబీ సీజన్‌కు సంబంధించి సాగు చేసిన పంటలకు ఈ నెల 15లోపు బీమా చెల్లించాలని ఏఓ విజయకుమార్ తెలిపారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం మార్గదర్శకాల్లో కొన్ని మార్పులు తీసుకొచ్చినట్లు తెలిపారు. పంట సాగు చేసిన ధ్రువీకరణ పత్రం, 1బీ, ఆధార్, బ్యాంక్ ఖాతా, ఫోన్ నంబర్‌ను రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందికి అందజేసి, బీమా చెల్లించాలని సూచించారు.

రబీ పంటలకు బీమా చేయించుకోండి

కుందుర్పి: మండల వ్యాప్తంగా రైతులు బోరుబావుల కింద సాగు చేసిన వివిధ రకాల పంటలకు బీమా చేయించుకోవాలని ఏవో మహేష్ సూచించారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రబీ పంటల బీమా చెల్లింపుపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

సంక్షిప్త సమాచారం

ఆరు వినతులు

కూడేరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆరు వినతులు వచ్చా యి. డీటీ సూర్య ప్రతాప్ అర్జీలు స్వీకరించా రు. ఎంపీడీఓ కుళ్లాయిస్వామి, ఏఓ విజయకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగదివ్య, ఈఓఆర్డీ రాధాకృష్ణ , ఏపీఎం దేవానంద ఫిలప్స్, ఎంఈఓ మహమ్మద్ గౌస్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, అరుణ పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

విడపనకల్లు: మండల కేంద్రంలో మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణం లో 18వ విడత ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ షకీలాబేగం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 పంచాయతీలో చేపట్టిన ఉపాధి హామీ పథకం కింద 2024 31 మార్చి నుంచి 2024 నవంబర్ 18న వరకు చేపట్టిన పలు అభివృద్ధి పనులపై సామాజిక తనిఖీ బృందం సామాజిక తనిఖీలు చేపట్టింది. దీనిపై మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక ఉంటుంది.

ఫాదర్ ఫెర్రర్ ఆలయం సందర్శన

కుందుర్పి: కుందుర్పిలో వెలసిన స్వర్గీయ విన్సెంట్ ఫాదర్ ఫెర్రర్ ఆలయాన్ని ఆర్డీటీ జిల్లా ఫార్మర్ డైరెక్టర్ సాగర్‌మూర్తి, సెంట్రల్ పర్చేస్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ పుష్ప తదితరులు సోమవారం సందర్శించారు. అనంతరం మండలంలో చేపడుతున్న సేంద్రియ వ్యవసాయం, ఆర్డీటీ సంస్థ ద్వారా జంబుగుంపల, నిజవళ్లి పంచాయతీల్లో నిర్వహిస్తున్న వివిధ అభివృద్ధి పనులపై స్థానిక ఎకాలజీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా కుందుర్పిలో రూ.4 కోట్లతో ఫెర్రర్ ఆలయం నిర్మించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వైబీ ఓబయ్య, సీఓ రవికుమార్, మల్లికార్జున, మహాదేవి, గంగాధర తదితరులు ఉన్నారు.

చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు



కొత్తకోట చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రాజేంద్ర

విడపనకల్లు: మండల పరిధిలోని వి.కొత్తకోటలో అంగన్‌వాడీ కేంద్రంలో డాక్టర్ రాజేంద్ర ఆధ్వర్యంలో చిన్నాలకు ఆరోగ్య పరీక్షలు సోమవారం నిర్వహించారు. చిన్నారుల పుట్టుకతో పాటు వచ్చే లోపాలను కూడా గుర్తించి చికిత్సలు అందించారు. అనారోగ్యంతో ఉన్న చిన్నారులను గుర్తించి మెరుగైన చికిత్స కోసం సీహెచ్, ఏహెచ్, డీఈఐసీలకు రెఫర్ చేశారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రమీల, సూపర్‌వైజర్ మునెమ్మ, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మీదేవి, మౌనిక, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

5న వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీ, పార్టీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5న ఉదయం 10 గంటలకు పార్టీ కార్యాలయంలో సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సమావేశంలో మున్సిపాలిటీ, రూరల్ మండలం, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర అనుబంధ విభాగాల వివిధ హోదాల్లో కార్యకర్తలను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. మండల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

కారు బోల్తా... నలుగురికి గాయాలు

కూడేరు: అరవకూరు వద్ద సోమవారం అనంతపురం- బళ్లారి ప్రధాన రహదారిపై వెళ్తున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంబాన్ని ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. మరుట్ల-3వ కాలనీకి చెందిన విజయకుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి అనంతపురం నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

రాయదుర్గంటౌన్: రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు ఇద్దరూ తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం సాయంత్రం జరిగింది. పట్టణ శివారు గొల్లపల్లి రోడ్డు రైల్వేగేటు దాటిన కొద్దిదూరంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి హనుమక్క, పాలయ్య ప్రమాదానికి గురయ్యారు. గాయ పడిన వీరిని స్థానిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం ఆస్పత్రికి తరలిం చారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అపార్ సమస్యలు పరిష్కరించండి



మంత్రి పయ్యావుల కేశవ్‌కు అపార్ సమస్యలను విన్నవిస్తున్న కూలీలు

బెళుగుప్ప: అపార్ అఫ్డేషన్ సమస్యలు పరిష్కరించాలని మంత్రి పయ్యావుల కేశవ్‌కు కూలీలు విన్నవించారు. సోమవారం మండల పరిదిలోని కోనాపురం వద్ద పంట పొలాల్లో పనులు చేస్తున్న వ్యవసాయ కూలీల వద్దకు వెళ్లిన మంత్రి.. వారితో మాట్లాడారు. కూలీలు మాట్లాడుతూ తమ పిల్లలకు అపార్ అప్డేషన్‌లో ఆధార్ జనరేషన్‌కు నోటరీ అడుగుతున్నారని, రూ.800 ఖర్చు అవుతోందన్నారు. దీనిపై విద్యాశాఖ సెక్రటరీ కోన శశిధర్, జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌తో మంత్రి మాట్లాడారు.

బస్సులు ఆపాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న కళాశాల విద్యార్థులు

బొమ్మనహాళ్: ఆర్టీసీ బస్సులు ఆపాలని విద్యార్థులు రోడ్డుపై నిరసన తెలియజేశారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు కళ్యాణదుర్గం -బళ్లారి రోడ్డుపై ఆందోళనకు దిగారు. దీంతో ట్రాఫిక్ కొంతసేపు స్తంభించింది. బస్సు పాస్‌ల కోసం నెలనెలా డబ్బులు చెల్లిస్తున్నా ఎక్కించుకోవడంలేదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రాయదుర్గం డిపో బస్సుల్లోనే వెళ్లాలని, కళ్యాణదుర్గం డిపో బస్సుల్లో ఎక్కకూడదని డ్రైవర్లు, కండక్టర్లు చెప్పడం సరికాదన్నారు.

విద్యాసంస్థల సమయానికి బస్సులు నడపాలి

రాయదుర్గంటౌన్: నియోజకవర్గ వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల సమయానికి బస్సులు నడపాలని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు శశికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్టీసీ డీఎం శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థులకు బడి బస్సులు లేక చదువులకు దూరమయ్యే పరిస్థితి ఉందన్నారు. గ్రామీణ విద్యార్థులు ఉదయం 7 గంటలకు ఇంటి నుంచి బయల్దేరితే తిరిగి రాత్రి 8 గంటలకు చేరుకుంటున్న పరిస్థితి ఉందన్నారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు అభిషేక్, మున్నా, ప్రదీప్, భీమేష్, జగదీష్, రమేష్ పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండండి

కళ్యాణదుర్గం: అపరిచిత వ్యక్తులపై వేకువజామున వాకింగ్‌కు వచ్చే మహిళలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ వంశీకృష్ణ సూచించారు. సోమవారం పట్టణంలో వేకువజామున కళ్యాణదుర్గం- రాయదుర్గం, బళ్లారి బైపాస్ రోడ్డులలో వాకింగ్ చేస్తున్న మహిళలకు చైన్ స్నాచింగ్‌పై అవగాహన కల్పించారు. బంగారు ఆభరణాలతో బయటకు వెళ్లేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పోలీసు సిబ్బంది రామలింగ, బాబు, పవన్, మధు పాల్గొన్నారు.

కనుకూరులో ఆవుల జాతర

శెట్టూరు: కనుకూరులో ఘనంగా ఆవుజాతర నిర్వహించారు. నరసింహస్వామి, రామలింగేశ్వరస్వామిని ఊరేగింపుగా చెరువు వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం గ్రామంలోని యాదవులు, ఇతరులు పశువుల మందలను, ఎడ్లబండ్లు, వ్యవసాయ ట్రాక్టర్లను అలంకరించి, గుడి చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.